7, 8 తేదీల్లో నారా భువనేశ్వరి రాక

కర్నూలు (అర్బన్), మార్చి 4: నారా భువనేశ్వరి ఈనెల 7, 8 తేదీల్లో జిల్లా పర్యటనకు రానున్నారని కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా పత్తికొండ, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలో పర్యటిస్తారని తెలిపారు. చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడంతో ఎంతో మంది మనస్తాపానికి గురై గుండె పోటుతో మృతి చెందారని, ఆ కుటుంబాలను ఆమె పరామర్శిస్తారని చెప్పారు. ఈపర్యటనలో తగిన రక్షణ కోరుతో జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు లేఖ రాశామని తెలిపారు.



దోచేస్తున్నారు..!

- రికార్డులు తారుమారు చేస్తున్న తహసీల్దార్లు
- రాజకీయ నాయకులకు దాసోహం
- ఇష్టారీతిన మ్యుటేషన్లు
- ప్రభుత్వ భూముల పరాధీనం
- ఆధారాలు ఉన్నా చర్యలు తీసుకోని ఉన్నతాధికారులు

నంద్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):

రుద్రవరం మండలం బీరవోలు గ్రామానికి సంబంధించిన సర్వే నంబరు 103కి సంబంధించిన భూములను అప్పటి తహసీల్దారు వెంకట శివ మ్యుటేషన్ చేసినట్లు రికార్డులు చూపుతున్నాయి. ఈ మ్యుటేషన్లను వెంకట శివ 2021, 22 సంవత్సరాల్లో ఎప్పుడెప్పుడు చేశారో తేదీ, సమయం, మ్యుటేషన్ చేసిన వారి పేరుతో సహా రికార్డులు చూపుతున్నాయి.

పాణ్యం మండలం తమ్మరాజుపల్లెలోని సర్వే నంబరు 312/2లోని 3.15 ఎకరాలు, సర్వే నంబరు 313లోని 20 సెంట్లు, సర్వే నంబరు 314లోని 57 సెంట్లు వెరసి 3.92 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి గతేడాది ఏప్రిల్ 26న మ్యుటేషన్ చేసినట్లు ఆధారాలు ఉన్నాయి.




సర్వే నంబరు 213 వాగు భూమి ఉన్నట్లు చూపుతున్న రెవెన్యూ రికార్డు (ఫైల్)




సర్వే నంబరు 312/2, 313, 314లోని 3.92 ఎకరాల భూమి ఇతరు పేరు మీద రిజిస్టరు అయినట్లు చూపుతున్న రికార్డు. (ఫైల్)

కొలిమిగుండ్ల మండలం గోర్విమానుపల్లె, పెట్నికోట గ్రామాల పరిధిలో సర్వే నంబరు 1221 కింద దాదాపు 410 ఎకరాలు ఉంది. ఇక ఈ గ్రామాల పరిధిలో సర్వే నంబరు 1360 చివరిది. ఈ భూములపై వైసీపీ నాయకుడు కన్నేశాడు. ఆ భూములను తన వారికి చెందేలా చేయమంటూ సంబంధిత తహసీల్దార్ ధోని ఆల్ఫ్రెడ్‌ను ఆదేశించడం, తహసీల్దార్ లేని సర్వే నంబర్లను సృష్టించి 1360-1 నుంచి మొదలు పెట్టి, 1360-2, 3, అంటూ సర్వే నంబర్లను పెంచుకుంటూ పోయి ప్రభుత్వ భూములను వైసీపీ నేత చెప్పిన వారికి డీకేటీ పట్టాల పేరిట కట్టబెట్టేశాడు. దీనికి సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయి. ఇవీ జిల్లాలోని ఆయా మండలాలకు సంబంధించిన తహసీల్దార్లుగా విధులు నిర్వహిస్తున్న అధికారులు వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అక్రమాలు. వీటికి సంబంధించి ఆధారాలతో సహా 'ఆంధ్రజ్యోతి' ఎప్పటికప్పుడు కథనాలు ప్రచురిస్తూనే ఉంది. అయినా వీరిపై జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అదేమంటే విషయాలను సేకరిస్తున్నాం, రికార్డులను పరిశీలిస్తున్నాం, త్వరలోనే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం' అని దాటవేత సమాధానాలిస్తున్నారు. అక్రమాలకు పాల్పడింది తమ తోటి ప్రభుత్వ ఉద్యోగులు కాబట్టి ఏమీ చర్యలు తీసుకోవడం లేదా? లేక తప్పులు చేసిన వారికి, ఉన్నతాధికారులకు మధ్య లాలూచీ నడుస్తోంది కాబట్టి చర్యలకు ఉపక్రమించడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



సర్వే నంబరు 1360-1, 2, 3 నుంచి వరుసగా డీకేటీ పట్టాలుగా చూపిస్తున్న రెవెన్యూ రికార్డు (ఫైల్)



సర్వే నంబరు 103లో 32.65 ఎకరాలు ఉన్నట్లు చూపుతున్న రెవెన్యూ రికార్డు (ఫైల్)

ఎందుకీ తాత్సారం..!

ప్రభుత్వ యంత్రాంగంలో కింది స్థాయి ఉద్యోగులు ఏదైనా తప్పు చేస్తే పై స్థాయి అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారు. ఒకవేళ ఆధారాలు దొరకకపోతే చర్యలు తీసుకోవడానికి కొంచెం సమయం తీసుకుంటారు. కానీ జిల్లాలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు ఏమాత్రం దృష్టి సారించడం లేదని జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే అర్థమవుతోంది. ఉదాహరణకు గతేడాది పాణ్యం ఇన్‌చార్జి తహసీల్దారుగా పనిచేసిన మల్లికార్జునరెడ్డి చేసిన మ్యుటేషన్లకు సంబంధించి విచారణ చేసిన అప్పటి ఆర్డీవో శ్రీనివాసులు మొదటి తప్పు కాబట్టి హెచ్చరించి వదిలివేయాలని పై అధికారులకు రిపోర్టు ఇచ్చినట్లు సమాచారం. అయితే ఆ తర్వాత వచ్చిన జేసీ ఆర్డీవో ఇచ్చిన రిపోర్టు మీద సంతృప్తి చెందలేదు. అవకతవకలకు సంబంధించి ఆధారాలు ఉన్నాయి కాబట్టి మల్లికార్జునరెడ్డి మీద చర్యలు తీసుకోవాలంటూ అప్పటి కలెక్టర్‌కు జేసీ రిపోర్టు ఇచ్చినట్లు సమాచారం. అయితే ఆ తర్వాత కలెక్టర్ మారడంతో మల్లికార్జున్‌రెడ్డి మీద చర్యలు ఆగిపోయాయి. ప్రస్తుతం ఆయన ఎలాంటి క్రమశిక్షణ చర్యలు ఎదుర్కోకుండానే పాణ్యంలోనే డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇక కొలిమిగుండ్ల తహసీల్దార్ ఆల్ఫ్రెడ్ తన బదిలీకి ముందు రికార్డులు తారుమారు చేసి భూములను బదలాయించాడు. ఆ తర్వాత ఆయన బదిలీపై వెళ్లడంతో ఆయనపై చర్యలు తీసుకునే అవకాశం దాదాపు లేదన్న అభిప్రాయం వెలువడుతోంది. అదేవిధంగా రుద్రవరం మండలం బీరవోలు గ్రామానికి సంబంధించిన రికార్డుల తారుమారు విషయంలో అప్పటి తహసీల్దార్ వెంకటశివ చాలా రోజుల కిందటే పదోన్నతిపై వేరే చోటుకు బదిలీపై వెళ్లారు. ఇక ఈ విషయానికి సంబంధించి కూడా అధికారులు ఇంకా విచారణ చేస్తున్నామని చెప్పుకొస్తున్నారు. ఇలా అక్రమాలు చేసిన వారిపై ఎన్నాళ్లు చర్యలు తీసుకోకుండా, కనీసం అవకతవకలను సరి చేయకుండా తాత్సారం చేస్తారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలా చర్యలు తీసుకోవడంలో ఆలస్యం చేస్తే.. ప్రతి అధికారి అలుసుగా తీసుకుంటాడన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిజంగా ఆధారాలు దొరకడం లేదా..?

ప్రభుత్వ అధికారి లేదా ఉద్యోగి ఏదైనా అక్రమాలకు పాల్పడితే వాటికి సంబంధించిన ఆధారాలు సేకరించడం పెద్ద కష్టమేమీ కాదు. పైగా రికార్డుల తారుమారు విషయమైతే మరింత సులువు. ప్రస్తుతం అంతా ఆన్‌లైన్ వ్యవస్థ కాబట్టి ఓ సారి రికార్డులు చెక్ చేస్తే ఎవరు, ఎప్పుడు రికార్డుల తారుమారు చేశారనే విషయం.. తేదీ, సమయం, పేరుతో సహా వస్తుంది. అయినా అధికారులు ఇంకా రికార్డులు పరిశీలించాలని చెబుతున్నారంటే.. తెరవెనుక ఏదో మతలబు జరుగుతోందన్న అనుమానాలు కలుగుతున్నాయి. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె ప్రభుత్వ భూములే తీసుకుంటే.. 'ఆంధ్రజ్యోతి'లో గతేడాది జూలైలో 'భూమాయ' పేరిట కథనం వెలువడిన కొద్ది రోజులకే అప్పటి నంద్యాల ఆర్డీవో శ్రీనివాసులు రికార్డులను వెంటనే పరిశీలించారు. కానీ సదరు ఇన్‌చార్జి తహసీల్దారు మల్లికార్జునరెడ్డిపైన పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక కొలిమిగుండ్ల భూముల విషయమైనా, రుద్రవరం భూముల విషయమైనా ఆర్ఎస్ఆర్ రికార్డును పరిశీలిస్తే విషయాలు వెంటనే తెలిసిపోతాయి. వాటికి సంబంధించిన పక్కా ఆధారాలతోనే 'ఆంధ్రజ్యోతి' కథనాలను ప్రచురించింది. పత్రికలకు ఆధారాలు దొరికినప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు ఆధారాలు దొరకవా? అనే ప్రశ్న తలెత్తుతోంది. మొత్తమ్మీద అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిసినా జిల్లా యంత్రాంగం ఆయా తహసీల్దార్లపై చర్యలు తీసుకోవడం లేదంటే.. తమ వారు కాబట్టే మీనమేషాలు లెక్కిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాజకీయ నాయకుల చెప్పు చేతల్లో..

మండల తహసీల్దార్లను అధికార పార్టీ నేతలు గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నాయి.. వాటిని ఎలా తమ పరం చేసుకోవాలనే విషయంలో సంబంధిత నియోజకవర్గ నేతలు వీరిని పావులుగా వాడుకుంటున్నారు. తహసీల్దార్లు కూడా వారు చెప్పినట్లు చేస్తూ భారీగానే నజరానాలు అందుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇలా అధికార పార్టీ నేతలు, తహసీల్దార్లు కలిసి విలువైన ప్రభుత్వ భూములను ఇష్టారీతిగా అన్యాక్రాంతం చేస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక ఇదే అదనుగా ఆయా తహసీల్దార్లు తమ సొంత పనులను కూడా చక్కబెట్టుకుంటూ, తమ అనుయాయులకు, సొంతవారికి మేలు జరిగే పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడైనా చిక్కుల్లో పడితే ఆదుకోవడానికి సదరు నేతల అండదండలు ఉండనే ఉంటాయన్న ధీమా. రుద్రవరం మండలం బీరవోలు రికార్డుల మార్పు విషయమే తీసుకుంటే.. అక్రమాలు జరుగుతున్నాయని అసలు యజమానులు కలెక్టర్, ఎస్పీ స్పందనలో పెట్టినా చర్యలు తీసుకోకపోవడం వెనకు ఏ రాజకీయ నాయకుడి ప్రోద్బలం ఉందో! అందరికీ తెలిసిన విషయమే! అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండటంతో ఆయా ఉద్యోగులు, అధికారులు చేసే అక్రమాల విషయాలు బయటకు రాకుండా తొక్కిపెట్టి, చర్యలు తీసుకోకుండా వదిలేస్తున్నారన్న విమర్శలూ లేకపోలేదు. ఇలా అధికార పార్టీ నాయకులు, అధికారులు, ఉద్యోగుల మధ్య జుగల్‌బందీ వల్ల విలువైన ప్రభుత్వ భూములు ఇతరుల పరం అవడమే కాకుండా, సామాన్యులకు న్యాయం దక్కకుండా పోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పాఠాలు నేర్వరేం...

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు కొంతమంది అధికారులు అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు విని జరిమానాలు, కోర్టు ధిక్కరణ కేసులు అనుభవించిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న పలు పరిణామాలపై తమకు న్యాయం జరగడం లేదనో లేక ప్రభుత్వ భూములు ఇష్టారీతిన ఇతరుల పరం చేస్తున్నారని ఎవరైనా కోర్టులను ఆశ్రయిస్తే ముందుగా పర్యవసానాలు ఎదుర్కోవాల్సింది. ఇప్పటికైనా అధికారులు వైసీపీ నేతలు మాటలు వినడం మానుకొని ప్రభుత్వ భూముల రక్షణ, సామాన్యులకు న్యాయం చేసేలా వ్యవహరిస్తే నలుగురిలో నవ్వుల పాలుగాకుండా ఉంటారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మయూర వాహనంపై మల్లన్న

- పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ
- నేడు రాష్ట్ర ప్రభుత్వం తరపున..

శ్రీశైలం, మార్చి 4:


శ్రీశైలం క్షేత్రంలో సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబు చేశారు. అనంతరం మయూర వాహనంపై అధిష్ఠింపజేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులు సమర్పించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం రాజగోపురం నుంచి వెలుపలకి తోడ్కొని వచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవం ముందు కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు ఆకట్టుకున్నాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నంది మండపం వరకు.. తిరిగి అక్కడి నుంచి బయలు వీరభద్ర స్వామి ఆలయం దాకా కొనసాగింది. భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. గ్రామోత్సవంలో ఆలయ అధికారులు, సిబ్బంది, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



మయూర వాహనంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు



గిరిజనుల సంప్రదాయ నృత్యం



పాతాళగంగ వద్ద భక్తుల కోలాహలం

టీటీడీ తరపున పట్టువస్త్రాల సమర్పణ..



శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం తరపున టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలతో వచ్చిన వీరికి శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం శ్రీశైల దేవస్థానం ఆలయ అధికారులు, టీటీడీ దేవస్థాన అధికారులు, అర్చకులు పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఆలయ ప్రవేశం చేసి స్వామిఅమ్మవార్లకు సమర్పించారు. మల్లన్నకు పట్టువస్త్రాలు సమర్పించడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని టీటీడీ ఈవో తెలిపారు. ఈ సందర్భగా టీటీడీ ఈవోను శ్రీశైల దేవస్థానంలో టీటీడీ తరపున అతిథి గృహన్ని నిర్మించాలని కోరారు.

నేడు రావణ వాహన సేవ..

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలో భాగంగా ఐదో రోజు మంగళవారం సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు రావణ వాహన సేవ నిర్వహిస్తారు. అనంతరం గ్రామోత్సవ కార్యక్రమం చేపడతారు.

నేడు కాణిపాకం నుంచి..

బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు ఉదయం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం, సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీ కళావేదిక, శివదీక్షా శిబిరాల ప్రాంగణంలో నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం సాంప్రదాయ నృత్యప్రదర్శన, వేణుగానం, భక్తి గీతాలు, భక్తి సంగీత విభావరి, శివలీలలు పౌరాణిక నాటకం, బాలనాగమ్మ నాటకం కార్యక్రమాలను నిర్వహించారు.



గీతాలు ఆలపిస్తూ..

స్పందన విజ్ఞప్తులను పరిష్కరించండి: కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), మార్చి 4: స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన విజ్ఞప్తులకు తక్షణమే స్పందించి నిర్దేత కాలపరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం వైఎస్ఆర్ సెంటినరీ హాల్లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ పద్మజ, జిల్లా అధికారులు ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన విజ్ఞప్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో 105 దరఖాస్తులు రాగా వాటన్నింటిని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 4 : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది 165 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రజియా సుల్తానా సోమవారం తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో గత ఏడాది కన్నా ఈ ఏడాది బస్సులను పెంచినట్లు ఆమె చెప్పారు. కడప జిల్లా నుంచి 10, తిరుపతి నుంచి 20, చిత్తూరు నుంచి 16, అన్నయ్య నుంచి 10, నెల్లూరు నుంచి 15, ఇతర జిల్లాల నుంచి కూడా నంద్యాల జిల్లాలోని శైవ క్షేత్రాలకు నడిపేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. మహానందికి 20 బస్సులు, ఓంకారానికి 8, భోగేశ్వరానికి 2, సంగమేశ్వరానికి 7, రుద్రకోడూరుకు 10, కొలనుభారతికి 2, యాగంటికి 10, వెల్దుర్తి - బ్రహ్మగుండానికి 15 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. మిగిలిన బస్సులను శ్రీశైలానికి నడుపుతున్నట్లు తెలిపారు. శివరాత్రి జాతర నిర్వహణకై 16 మంది అధికారులు, 110 మంది ఉద్యోగులు విధులు నిర్వహించనున్నారని చెప్పారు. శ్రీశైలం నుంచి దోర్నాల మధ్యలో బస్సులు మరమ్మతులకు గురైతే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా తుమ్మలబైలు, చింతల వద్ద మెకానికల్ సిబ్బంది స్పాట్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. సిబ్బందికి మెడికల్ క్యాంపును శ్రీశైలం ఏర్పాటు చేశామని అన్నారు.

నంద్యాలకు బయలుదేరిన ఉత్సవమూర్తులు

పెళ్లి పెద్దగా రావాలని బ్రహ్మనందీశ్వరుడికి ఆహ్వానం



నంద్యాలకు బయలు దేరిన మహానందీశ్వరుని ఉత్సవమూర్తులు

మహానంది, మార్చి 4: బ్రహ్మనందీశ్వరుడిని పెళ్లి పెద్దగా ఆహ్వానించేందుకు మహానంది క్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులు సోమవారం నంద్యాలకు బయలుదేరారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే కల్యాణానికి ఆనవాయితీ ప్రకారం నంద్యాలలోని బ్రహ్మనందీశ్వరుని ఆహ్వానిస్తారు. ఇందులోభాగంగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలు సోమవారం సాయంత్రం ప్రత్యేక వాహనంలో నంద్యాలకు బయలుదేరాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై ఆశీనులు చేశారు. వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఉత్సవమూర్తులు మేళతాళాలతో నంద్యాలకు బయలుదేరారు. మార్గమధ్యంలోని గ్రామాల్లో ఉత్సవమూర్తులకు ప్రజలు స్వాగతం పలికి కాయకర్పూరాలు సమర్పించారు. మంగళవారం రాత్రి తిరిగి ఉత్సవమూర్తులు మహానందికి చేరుకుంటారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 863 మంది గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 4: జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సోమవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 863 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 24,802 మంది నమోదు చేసుకున్నారని చెప్పారు. 23,939 మంది పరీక్షకు హాజరు కాగా, 863 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

నంద్యాల జిల్లాలో 705 మంది..

నంద్యాల (నూనెపల్లె), మార్చి 4 : జిల్లాలో జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 705 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో సునీత సోమవారం తెలిపారు. జనరల్ విభాగంలో 13,680 మంది విద్యార్థులకుగాను 586 మంది గైర్హాజరయ్యారని అయన చెప్పారు. ఒకేషనల్ విభాగంలో 1374 మంది విద్యార్థులకుగాను 119 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ జరగలేదని ఆమె అన్నారు.

రీ వాల్యుయేషన్‌లో 91 శాతం ఉత్తీర్ణత!

ఒకేసారి ఇంత మంది పాస్ కావడంపై అనుమానాలు

కర్నూలు(అర్బన్), మార్చి 4: రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థుల జీవితాలతో అధికారులు చెలగాటమాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా 43 బీఈడీ కళాశాలలు ఉండగా ఇటీవల 4వ సెమిస్టర్ రీ వాల్యుయేషన్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. 847 మంది దరఖాస్తు చేసుకోగా 777 మంది 91 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. 1వ సెమిస్టర్ పరీక్షలో 813 మందికి 353 మంది 45 శాతంతో ఉత్తీర్ణత సాధించడం పలు అనుమానాలకు దారి తీసింది. పరీక్షలు బాగా రాసినప్పుడు మూల్యాంకనంలో అధ్యాపకులుగా వ్యవహరించిన తీరు చర్చనీయాంశమైంది. ఒకేసారి ఇంత మందిని కక్ష గట్టి ఫెయిల్ చేశారా అని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకుడు అబ్దుల్లా ప్రశ్నించారు. పైగా ఫెయిలైన విద్యార్థులు మళ్లీ ఉత్తీర్ణత సాధించడం దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నారు. దీనికి యూనివర్సిటీ అధికారులే సమాధానం చెప్పాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పైగా ఈ పరీక్షల ఫలితాలను చూసి విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు, యూనివర్సిటీ అధికారుల తీరుపై గగ్గోలు పెడుతున్నారు. యూనివర్సిటీలో పరీక్షల విభాగం గాడి తప్పిందని కళాశాలల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి,

గిరిజన పాఠశాలను సందర్శించిన ఐబీ బృందం



బాలికల క్రీడల విజయాలను పరిశీలిస్తున్న బృందం

పాణ్యం, మార్చి, 4 : మండలంలోని బలపనూరు పరిధిలో గల ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాల (పీటీజీ- చెంచు)ను ఇంటర్నేషనల్ బాకలారెట్ బృందం సందర్శించింది. సోమవారం అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రం ఐబీ మేనేజరు వెండిగ్రీన్, ఇంగ్లాండు ఐబీ డెవలప్‌మెంట్ ప్రత్యేక అధికారి ఎరిక్ బాబర్, డాక్టర్ గిరిబాబుయాదవ్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఎనిమిది, తొమ్మిది తరగతుల ఆంగ్ల మాధ్యమం సైన్స్, గణితం సబ్జెక్టులలో ఐఎఫ్‌బీల విద్యాబోధనలను పరిశీలించారు. ఉపాధ్యాయుల విద్యాబోధన, ఆర్ట్ గ్యాలరీని పరిశీలించారు. క్రీడల్లో బాలికలు ప్రదర్శించిన ప్రతిభను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన నృత్యాలలో బృందం పాల్గొని నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ లలిత, ఎంఈఓ కోటయ్య, ప్రిన్సిపాల్ మేరి సలోమి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ లోపు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

జేసీకి వినతి పత్రం ఇచ్చిన జర్నలిస్టులు



వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కర్నూలు(కల్చరల్), మార్చి 4: ఎన్నికల కోడ్ వచ్చేలోపు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఐజేయూ, జాతీయ సమితి సభ్యుడు కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోపు ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉండడంతో జర్నలిస్టులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. అధికారులు కోడ్ వచ్చేలోపు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ గార్గేయపురంలో స్థలం గుర్తించామని అన్నారు. అయితే అందులో ఒకరికి మైనింగ్ కోసం లీజుకు ఇవ్వడంతో రద్దు చేయమని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కర్నూలు ఆర్డీవో, తహసీల్దార్‌తో మాట్లాడి వెంటనే ఫైల్ పెట్టాలని డీఆర్వో, మైనింగ్ డీడీని ఆదేశించారు. మైనింగ్ లీజు రద్దు కాగానే ఇళ్ల పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్రిడిటేషన్ జర్నలిస్టులందరికీ ఇంటి స్థలం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సుంకన్న, అంజి, దస్తగిరి, శివరాజ్‌కుమార్, మధు, స్నేహల్, సాగర్, రఫీ, మధుసూదన్‌రెడ్డి, మోహన్, సూర్య రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తులు పెంచుకునేందుకే మంత్రి పదవి

- అభివృద్ధి ముసుగులో బుగ్గన దోపిడీ
- టీడీపీ నేత కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విమర్శ



డోన్‌లో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 4: బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తన ఆస్తులు పెంచుకోడానికి ఆర్థిక మంత్రిని అడ్డం పెట్టుకున్నారని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం డోన్ పట్టణంలోని టీడీపీ యువనేత కోట్ల రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో సాయి ఫంక్షన్ హాలులో జరిగిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రెండు సార్లు సీఎం పదవి చేపట్టి ప్రజలకు సేవ చేశారేగాని రాజకీయాలను వ్యాపారంగా ఎన్నడూ చూడలేదని అన్నారు. ఒకసారి ఆర్థిక మంత్రి పదవి నిర్వహించిన బుగ్గనకు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మంత్రి పదవి అడ్డం పెట్టుకొని అభివృద్ధి ముసుగులో బుగ్గన ఇష్టారాజ్యంగా దోచేశారని ఆరోపించారు. పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని కొనడానికి, ఇతర రాష్ట్రాల్లో సిమెంటు ఫ్యాక్టరీని కొనుగోలు చేయడానికి ఆయనకు వందల కోట్ల రూపాయాలు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. అభివృద్ధి అంటే బుగ్గనకు ప్రజల సొమ్మును జేబులో పెట్టుకోవడమే అని ఆరోపించారు. అభివృద్ధి చేసిఉంటే అక్రమ కేసులు ఎందుకు బనాయిస్తున్నావని మంత్రిని ప్రశ్నించారు.

ఫ్యాక్షన్‌ను ఏనాడూ ప్రోత్సహించలేదు...

డోన్ నియోజకవర్గంలో కోట్ల, కేఈ కుటుంబాలు రాజకీయంగా పోరాడాయే తప్ప ఎన్నడూ ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించ లేదని అన్నారు. నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌ను ఎప్పుడో నిర్మూలించి ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించామన్నారు. తనపై ఫ్యాక్షన్ కేసులు ఉన్నట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని మంత్రి బుగ్గనకు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సవాల్ విసిరారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన మంత్రి బుగ్గన సిగ్గు లేకుండా అనవసర విమర్శలు చేస్తున్నారని, ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే డోన్ నియోజకవర్గాన్ని ఎంపిక చేసి రూ.300 కోట్లు మంజూరు చేసిందని, అదంతా తాను చేసినట్లు బుగ్గన చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. డోన్ నియోజకవర్గంలో, ఇతర జిల్లాల్లో మైనింగ్ వ్యాపారాలను తన గుప్పిట్లో పెట్టుకుని సంపాదిస్తున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. వైసీపీ సిద్ధం సభలకు రూ.150 కోట్లు ఖర్చు పెట్టి రాష్ట్రమంతటా ఉన్న జనాలను తరలిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం లేదా? అని మండిపడ్డారు. కోట్ల కుటుంబానికి ప్రజల అభిమానమే ఆస్తి అని, రాబోయే ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులు తనకు ఉంటాయని కోట్ల ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, రేగటి రామ్మోహన్ రెడ్డి, డోన్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల పార్టీ అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, భాస్కర్ నాయుడు, నల్లమేకలపల్లి భాస్కర్‌రెడ్డి ఓంప్రకాష్, ఎర్రగుంట్లపల్లి రమేష్ రెడ్డి, చంద్రపల్లి ఆచారి, రంజిత్ కిరణ్, ఎస్ఎండీ రఫి, అన్వర్‌బాషా, భాష్యం శ్రీను, కేఈ శ్యాం, ఎల్లగౌడు, గురుస్వామి యాదవ్, వలసల బాలుడు పాల్గొన్నారు.

జొళదరాసికి జగన్ దగా

- నాలుగేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన మినీ రిజర్వాయర్
- వివేకా హత్య కేసులో సీఎం జగన్ పాత్రపై విచారణ జరపాలి : మాజీ ఎమ్మెల్యే బీసీ

కోవెలకుంట్ల, మార్చి 4: కోవెలకుంట్ల పట్టణ సమీపంలోని కుందూ నదిపై జొళదరాసి మినీ రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేసి 16 నెలల్లో పూర్తి చేస్తానని చెప్పిన సీఎం నాలుగేళ్లుగా విస్మరించి ఈ ప్రాంత ప్రజలను దగా చేశారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మేనిఫెస్టో కరపత్రాలను ఇందిరమ్మ కాలనీలో ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ళు పూర్తయినా జొళదరాసి మినీ రిజర్వాయర్‌కు ఒక ఇటుక కూడా పేర్చిన పాపానపోలేదని బీసీ విమర్శించారు. కుందూనది వైండింగ్ పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నారు. టీడీపీ హయంలో కుందూనదిని, ఎస్సార్బీసీని పారించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. రైతు సంక్షేమం గురించి జగన్ మాటలు ఊదరగొట్టడం తప్పితే అన్నదాతలకు ఒరగబెట్టిందేమి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసమే వివేకానందరెడ్డిని జగన్ ముఠానే హతమార్చిందని బీసీ అన్నారు. జగన్ సీఎం కాగానే ఈ కేసు విచారణలో పురోగతి ఎందుకు ఆగిపోయిందని బీసీ ప్రశ్నించారు. ఈ ఘటనలో జగన్ పాత్రై సమగ్ర విచారణ జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన పార్టీలకు చెందిన నాయకులు బీసీ ప్రసాద్‌రెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, లాయర్ శ్రీకాంత్, గడ్డం అమర్‌నాథరెడ్డి, పెనుగొండ రాజశేఖర్, అమడాల మద్దిలేటి, మురళి, జనసేన నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న బీసీ

ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలిగా నాగ సుప్రజ



నంద్యాల జిల్లా మహిళా విభాగం కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళలు

బనగానపల్లె, మార్చి 4: జిల్లా ఆర్యవైశ్యసంఘం మహిళా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం యాగంటి క్షేత్రంలో సోమవారం నిర్వహించారు. యాగంటిలోని శ్రీవాసవి అన్నదాన సత్రంలో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా సంఘాల నూతన ప్రథమ అధ్యక్షురాలిగా గుండా నాగ సుప్రజ, జనరల్ సెక్రటరీగా నల్లగట్ల ఉమామహేశ్వరి, కోశాధికారిగా దమ్మాల లక్ష్మి, వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలిగా అనుమల విజయలక్ష్మి, అదనపు కార్యదర్శిగా శ్రీలక్ష్మి, ఇతర కార్యవర్గ సభ్యులుగా పలువురు ప్రమాణ స్వీకారం గావించారు. ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు చిన్న రామ సత్యనారాయణ, మహిళా విభాగం గౌరవ అధ్యక్షురాలు రావూరి రజని తది తరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మేలుజాతి పశువుల ఉత్పత్తికి రంగం సిద్ధం

కృత్రిమ గర్భధారణ, సరోగసి విధానాల అమలుకు శ్రీకారం

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 3: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మేలుజాతి పశువులు అంతరించిపోకుండా వాటి ఉత్పత్తిని పెంచేందుకోసం పశుసంవర్ధక శాఖ సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. సరోగసి (అద్దె గర్భం)తో పాటు కృత్రిమ గర్భధారణ విధానాల ద్వారా మేలుజాతి పశువుల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య సోమవారం తెలిపారు. సరోగసి విధానంలో మేలుజాతి పశువుల ఉత్పత్తిని పెంచేందుకు రాష్ట్రంలోని గుంటూరు లాంఫామ్ పశు క్షేత్రంలోనే మేలుజాతి పశువుల వీర్యాన్ని సేకరించి పిండాలను అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని చేపట్టామని, అదే విధంగా నెల్లూరు జిల్లా చింతలదీవి పరిధిలోని మేలు జాతి పశువుల వీర్యంతో పిండాలను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించినట్లు రామచంద్రయ్య తెలిపారు ఈ పిండాలను ఎంపిక చేసిన నాటు పశువుల గర్భంలో ప్రవేశపెట్టడం ద్వారా మేలు జాతి దూడల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ ప్రక్రియపై అవగాహన పెంచుకుని జిల్లాలో విజయవంతం చేసేందుకు కౌతాళం పశుసంవర్ధక ఆసుపత్రిలో పని చేస్తున్న డా. జగదీష్‌కు గుంటూరులోని లాంఫామ్‌లో వారం రోజుల పాటు శిక్షణ కూడా ఇప్పించామన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు

రైతులు ఈక్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 4: ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులకు ప్రభుత్వం ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. వేరుశనగ, పప్పుశనగ, మినుములను మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఆ సంస్థ జిల్లా మేనేజర్ రాజు తెలిపారు. సోమవారం నగరంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనగలకు క్వింటానికి మద్దతు ధర రూ.5,440, వేరుశనగలకు మద్దతు ధర రూ.6,377, మినుములకు మద్దతు ధర రూ.6,950గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ పంట ఉత్పత్తులను మార్క్‌ఫెడ్ సంస్థ కేంద్రాల్లో విక్రయించడానికి ముందు ఆర్బీకే కేంద్రాల్లో ఈక్రాప్, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారని అన్నారు. నాణ్యతా ప్రమాణాలను అనుసరించి శనగలు, వేరుశనగ కాయలు, మినుములు కొనుగోలు చేస్తామని మేనేజర్ రాజు తెలిపారు.

ఎన్నికల వ్యయాన్ని లెక్కకట్టండి

- నిబంధనలను పటిష్టంగా అమలు పరచండి
- జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల (కల్చరల్), మార్చి 4: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చు వివరాలను పక్కాగా లెక్కకట్టి రికార్డుల్లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్ వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ బృంద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో సాధారణ ఎన్నికలు-2024 భాగంగా ఎంసీసీటీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్టీ టీంలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు.

తలముడి సమీపంలో రోడ్డు ప్రమాదం

- ఐదుగురికి తీవ్ర గాయాలు

నందికొట్కూరు, మార్చి 4: మిడ్తూరు మండలం తలముడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రగాయాలపాలయ్యారు. గడివేములకు వెళ్తున్న రెండు ఆటోలను, ఒక ద్విచక్రవాహనాన్ని నందికొట్కూరు వైపుగా వస్తున్న గుర్తుతెలియని టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో రెండు ఆటోల్లో ప్రయాణిస్తున్న ముగ్గురు, ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు మొత్తం ఐదుగురు ప్రయాణికులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో ఓర్వకల్లు మండలం కొమ్మరెల్లి గ్రామానికి చెందిన దస్తగిరి, నీలావతి, డోన్ నుంచి గడివేములకు ద్విచక్రవాహనంపై వస్తున్న మౌలానాబి, సిద్ధయ్య, గడివేముల మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ లక్ష్మీనారాయణ గాయపడ్డారు. వీరిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిడ్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేసీ కాల్వలో పడిన వాహనం : నలుగురికి గాయాలు

జూపాడుబంగ్లా, మార్చి 4: శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తున్న భక్తుల వాహనం కేసీ కాల్వలో పడిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గుంతకల్లు సమీపంలో ఓ గ్రామానికి చెందిన శివభక్తులు శ్రీశైలం క్షేత్రానికి దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా జూపాడుబంగ్లా వద్ద సోమవారం రాత్రి అదుపుతప్పి కేసీ కాల్వలో పడిపోయింది. జూపాడుబంగ్లా గ్రామస్థులు వాహనంలో ఉన్న పది మందిని రక్షించారు. వారిలో వంశి, సురేష్, ఒంటెన్నలతోపాటు మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. జూపాడుబంగ్లాలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించుకున్నారు.

మల్లన్న సన్నిధిలో సినీ హీరో విష్వక్సేన్



శ్రీశైలం, మార్చి 4: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం తెలుగు సినీనటుడు విష్వక్సేన్ చిత్ర యూనిట్‌తో కలిసి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శ నానంతరం ఆయన క్షేత్ర పరిధిలోని రుద్రవనం లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా విష్వక్సేన్ నటించిన గామి సినిమా విశేషాలపై మాట్లాడారు. గామి సినిమా ఐదు సంవత్సరాల కింద వారణాసిలో ప్రాంభమైందని చిత్రంలో కొన్ని సన్నివేశాల కోసం చిత్రం ఆలస్యమైందని తెలిపారు. సోమవారం సాయంత్రం గామి సినిమాలోని శివశివ అనే పాటను విడుదల చేస్తున్న సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడం ఆనందాన్ని కలిగించిందన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వ్యక్తికి జైలు శిక్ష

నంద్యాల క్రైం, మార్చి 4: నంద్యాల వన్‌టౌన్ పరిధిలో ఓ వ్యక్తి మద్యం సేవించి ప్రజలు, వాహనదారులకు ఆటంకం కలిగించిన కేసులో ఏడు రోజుల జైలు శిక్ష పడింది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని చాంద్‌బాడ, ఫాతిమా స్కూల్ సమీపంలో సోమవారం నడిగడ్డకు చెందిన షేక్ మహబూబ్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనాలు, ప్రజలకు ఆటంకం కలిగిస్తూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి నంద్యాల సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి ఎదుట హాజరుపరచగా ఏడు రోజుల రిమాండ్ విధించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటచలపతి తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంట్లో చోరీ

రూ.50 వేల నగదు, 2 తులాల బంగారం అపహరణ

నంద్యాల క్రైం, మార్చి 4: నంద్యాల పట్టణంలోని రైతునగర్‌లో సోమవారం సాఫ్ట్‌వేర్ కౌశిక్ ఇంట్లో దొంగలు పడ్డారు. బీరువా తాళాలను పగులగొట్టి అందులో ఉన్న రూ.50 వేల నగదుతోపాటు రెండు తులాల బంగారం అపహరించారు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో నమోదయ్యాయి. బాధితుడు కౌశిక్ ఫిర్యాదు మేరకు నంద్యాల తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దొంగల కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

మిర్చి అమ్మేందుకు వెళుతుండగా ఘటన

పెద్దకడుబూరు మార్చి04: కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా సమీపంలోని రామాపురం గ్రామం వద్ద మినీ వాహనం టైరు పంక్చర్ కావడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో రోగెన్న(30) అనే రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పెద్దకడబూరు మండలానికి చెందిన ఐదుగురు రైతులు మిరప కాయలను అమ్ముకునేందుకు మినీ వాహనంలో కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగి పట్టణానికి బయలుదేరారు. ఆదివారం అర్ధరాత్రి బళ్లారి జిల్లా సమీపంలోని రామాపురం గ్రామం వద్ద వాహనం టైరు పంక్చర్ అయి బోల్తా పడడంతో రైతు రోగెన అక్కడిక్కడే మృతి చెందాడు. మిగతా నలుగురు రైతులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారిని బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడుకి భార్య జయమ్మ, ఒక కుమార్తె ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

నంద్యాల క్రైం, మార్చి 4 : సైబర్ నేరాలపట్ల అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చంటూ వాట్సాప్ ఎలో, టెలిగ్రామ్ యాప్‌ల ద్వారా పంపే లింక్‌లను ఎలాంటి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇస్తామంటూ ప్రజలను ఆకర్షించి కోట్లలో దోచుకుంటున్నారని, వర్చువల్ అకౌంట్స్‌తో మాయ చేస్తూ లక్షల్లో నకిలీ సైట్‌లో ఇన్వెస్ట్ చేయించి మోసం చేసే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దన్నారు. ఏదైనా ఇబ్బందుల్లో పడితే సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి కాల్‌చేసి సమాచారం అందించాలని కోరారు.



శ్రీశైలంలో భక్తుల రద్దీ పెరుగుతోంది.. ప్రధాన వీధులన్నీ శివభక్తులతో నిండిపోతున్నాయి. దర్శనానికి సుమారు రెండు, మూడు గంటల సమయం పడుతోంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. - శ్రీశైలం

శ్రీకృష్ణ ఆలయంలో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపకదళ సిబ్బంది

నంద్యాల క్రైం, మార్చి 4 : నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఆలయం ప్రహరీని ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయి అగ్గిరవ్వలు పక్కనే ఆవుల మేత కోసం వేసిన గడ్డివామిపై పడ్డాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రజలు, భక్తులు నీళ్లు చల్లినా మంటలు అదుపుకాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచా రం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే కొంత భాగం గడ్డివామి కాలిపోయింది.

ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం


నగదును అందజేస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్న

మహానంది, మార్చి 4: మహానంది ఆలయ అభివృద్ధికిగాను దేవస్థానం సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే రంగన్న రూ.50 వేలు నగదును అందజేసినట్లు ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఉద్యోగి నగదును ఆలయం పరిసరాల్లో శాశ్వత క్యూలైన్ ఏర్పాటుకు అందజేశారు. ఇటీవలనే సీనియర్ అసిస్టెంట్ రంగన్న శ్రీశైలం దేవస్థానానికి బదిలీ అయ్యారు. మహానంది మహాశివరాత్రి ఉత్సవాలు పూర్తయ్యాక ఇక్కడి నుంచి రిలీవ్ చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

కర్ణాటక భక్తురాలికి నగదు అప్పగింత

మహానంది, మార్చి 4: దైవదర్శనం కోసం మహానందికి వచ్చిన కర్ణాటక రాష్ట్రం హేచోషాల్ గ్రామానికి చెందిన భక్తురాలు రామోళీ లక్ష్మి క్యూలైన్‌లో పోగొట్టుకొన్న నగదు రూ.13 వేలను గంట వ్యవధిలోనే ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్న తిరిగి వెతికించి అప్పగించారు. సోమవారం ఆలయ పరిసరాల్లోని క్యూ లైన్‌లో కర్ణాటక భక్తురాలు పొరపాటున తన వద్ద ఉన్న నగదును పోగొట్టుకుంది. ఈ విషయాన్ని దర్శనం తర్వాత గమనించి అక్కడ విధుల్లో ఉన్న హోంగార్డు బాలుడుకు తెలిపింది. వెంటనే ఆయన టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్న సహకారంతో సీసీ పుటేజీలను పరిశీలించారు. డబ్బులు తీసిన వారిని గమనించి వెతికి పట్టుకొన్నారు. అనంత రం బాధిత భక్తురాలికి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో నగదును అప్పగించారు.

గోదాములు ప్రారంభించిన ఎమ్మెల్యే

బండిఆత్మకూరు, మార్చి 4: మండలంలో సహకార పరపతి సంఘాల ద్వారా రూ.7కోట్లతో నిర్మించిన పది గోదాములను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. సోమవారం భోజనం, చిన్నదేవళాపురం, నారాయణపురం, లింగాపురం, సంతజూటూరు, ఈర్నపాడు, కడమలకాల్వ, పార్నపల్లె గ్రామాల్లో ఒక్కొక్కటి, బండిఆత్మకూరులో రెండు గోదాములను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీ డైరెక్టర్ వెంకటేశ్వరమ్మ, శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, మేనేజర్ నారాయణరెడ్డి, సీఈవోలు గోపాల్, శీను, వెంకటరామిరెడ్డి, డైరెక్టర్లు శివశంకర్, శ్రీకాంత్‌రెడ్డి, మౌలాలి పాల్గొన్నారు.

- అక్కలంతా తనకు అండగా నిలవాలని, బావలతో ఏమి పనిలేదని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. దీంతో సభలో మహిళలు ముసి ముసి నవ్వు నవ్వుకున్నారు. సోమవారం పార్నపల్లె టీటీడీ కళ్యాణ మండపంలో రిజిస్టర్ ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా మంది బావలు జై టీడీపీ అంటుంటారని, వారిని ఏ మాత్రం పట్టించుకోవద్దని సూచించారు.

ఆర్‌బీకేల్లో ఈ-క్రాప్ జాబితా

గోస్పాడు, మార్చి 4 : మండలంలోని 2023 -2024 రబీ పంటలకు సంబంధించిన ఈ-క్రాప్ జాబితాను నోటీసు బోర్డులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి స్వప్నిక తెలిపారు. ఈ జాబితాలపై రైతుల నుంచి అభ్యంతరాల స్వీకరణ కోసం ఆర్‌బీకే స్థాయిలో గ్రామ సభలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ తమ గ్రామంలో ఆర్‌బీకేలను సందర్శించి అక్కడ ప్రదర్శించిన ఈ -క్రాప్ జాబితాను పరిశీలించుకోవాలని అన్నారు. 8న తుది జాబితాను ప్రదర్శిస్తామని, సవరణలు చేసుకునేందుకు ఇదే చివరి అవకాశమని తెలిపారు. ఈ జాబితా ఆధారంగానే పంట నష్ట పరిహారం, పంట బీమా వంటి సాయం అందుకునేందుకు అర్హత పొందుతారని తెలిపారు.

ఉపాధి సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కొత్తపల్లి, మార్చి 4: ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ల ఆపరేటర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని టీఏలు కిరణ్ కుమార్, ప్రసాద్, శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొత్తపల్లిలోని వారు ఉపాధి హామీ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉపాధిలో పని చేస్తున్న టీఏలు, సీవోలు గత పది సంవత్సరాలుగా గ్రేడ్ ఫిక్సేషన్ కోసం పోరాడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీఏలు ఓబులమ్మ, బసిరున్, మజార్‌బాషా, సీవోలు నాగేశ్వరరావు, బాలాజి నాయుడు అన్నారు.

సంగమేశ్వరంలో సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన

కొత్తపల్లి, మార్చి 4: మండలంలోని సప్తనదుల సంగమేశ్వరంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్యహరిశ్చంద్ర ఉచిత నాటక ప్రదర్శన దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు గంగన్న, బొల్లు శ్రీనివాసులు, భోంపల్లి యాదవ్‌లు తెలిపారు. 8న శుక్రవారం రాత్రి కొలను భారతి నాట్య కళామండలి, పెద్దగుమ్మడాపురం వారిచే మహాశివరాత్రి జాగారణ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఉచిత నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనతో పాటు పడకశ్రీను, భవాని శ్రీను, తదితర నాటక ప్రదర్శనలు ఉంటాయనీ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

'ఆ ఉపాధ్యాయులపై విచారణ జరపాలి'


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 4 : బనగానపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న కొంత మంది ఉపాధ్యాయులపై విచారణ జరపాలని ఆల్ ఇండియా యూత్ లీగ్ రాష్ట్ర కార్యదర్శి రాజు నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం రాజు నాయుడుతో పాటు డెమోక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగసారి సుంకన్నలు కలెక్టరేట్‌లో డీఈవో సుధాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు మాధవ స్వామి, రాజునాయక్, యాగంటప్పలపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

గడివేముల, మార్చి 4: మండలంలోని బిలకలగూడురు గ్రామానికి చెందిన మల్లేపోగు ప్రశాంత్, మల్లేపోగు భాస్కర్, మారెమ్మలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. డోన్ పట్టణానికి చెందిన రూపను బిలకలగూడురు గ్రామానికి చెందిన ప్రశాంత్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, రూప 8 నెలల గర్భిణి. కొద్ది రోజులుగా రూపను భర్త ప్రశాంత్, మామ భాస్కర్, అత్త మారెమ్మలు అదనపు కట్నం తెవాలని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని, బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు


నంద్యాలలో ఎన్‌ఎండీ ఫిరోజ్ సమక్షంలో టీడీపీలో చేరిన యువత

నంద్యాల (నూనెపల్లె), మార్చి 4 : నంద్యాలలో పలు వార్డుల నుంచి వైసీపీ నాయకులు, యువత టీడీపీ తీర్థం తీసుకొంటున్నారు. గత మూడు రోజుల నుంచి చేరికలు టీడీపీలోకి భారీగా కొనసాగుతున్నాయి. సోమవారం 6వ వార్డులో కామిని మల్లికార్జున, చెన్నంశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో దాదాపు 150 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు, నంద్యాల టీడీపీ ఇన్‌చార్జీ ఎన్‌ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే 8వ వార్డు ఉప్పరిపేట వైసీపీ నుంచి యువకులు టీడీపీలోకి చేరారు. వార్డు ఇన్‌చార్జీ ఉప్పరి సురేష్‌కుమార్, ఉప్పరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టీడీపీ తీర్థం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ వైసీపీ పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసికిపోవడంతో టీడీపీలోకి వస్తున్నారని అన్నారు.

ఆవులకు దాణ సరఫరా చేస్తాం


ప్రమాదాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఎండీ ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 4 : నంద్యాలలోని పద్మావతినగర్ శ్రీకృష్ణ దేవాలయంలో ఆవులకు మేతగా ఉంచిన గడ్డి వాములు సోమవారం అగ్ని ప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ దేవాలయానికి చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆయన స్థానికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేవాలయంలో ఆవులకు ఉన్న దాణ పూర్తిగా కాలిపోవడంతో ఆవులకు ఇబ్బంది కలగకుండా కావాల్సిన దాణాను సరఫరా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. దేవాలయ నిర్వాహకులు ఫిరోజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వాకా శివశంకర్, మంజుల సుబ్బరాయుడు, తదితరులు ఉన్నారు.

శివస్వాముల దాహం తీరుస్తున్న దాతలు


శివస్వాములకు మజ్జిగ అందిస్తున్న విద్యార్థినులు

ఆత్మకూరు రూరల్, మార్చి 4: శివస్వాములు, భక్తులు పాదయాత్రగా వెంకటాపురం చేరుకుని అక్కడి నుండి నల్లమల అరణ్య ప్రాంతం గుండా శ్రీశైలం చేరుకుంటున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీగిరి చెంతకు పాదయాత్రగా తరలివెళ్లే భక్తుల కోసం పలువురు దాతలు అడుగడుగునా చలి వేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేసి శివస్వాములు దాహార్తి తీరుస్తున్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో నవభారత్ ఫర్టిలైజర్స్ ప్రతిధులు అయ్యస్వామి, బీటీ రామానాయుడుల ఆధ్వర్యంలో, వెంకటాపురంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఆత్మకూరు పట్టణంలో మారం భానుమూర్తి ఆధ్వర్యంలో, శ్రీపతిరావుపేట గ్రామశివార్లలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో, కరివేన గ్రామశివార్లలో ఫ్రెండ్స్ అండ్ పీస్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు, మజ్జిగ, పండ్ల వితరణ కార్యక్రమాలను చేపట్టి తమ దాతృత్వాన్ని చాటుతున్నారు.

కరెంట్ బిల్లులు కట్టే ప్రసక్తే లేదు

- మిడుతూరు మండల సర్వసభ్య సమావేశంలో తేల్చి చెప్పిన బైరాపురం సర్పంచ్


అధికారులను నిలదీస్తున్న బైరాపురం సర్పంచ్ ఫణిభూషన్‌రెడ్డి

నందికొట్కూరు, మార్చి 4: పంచాయతీలో నిధులు లేక నానా ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ బిల్లులు చెల్లించాలని సర్పంచ్‌లపై అధికారులు ఒత్తిడి తీసుకు రావడం సరికాదని మిడ్తూరు మండలంలోని బైరాపురం సర్పంచ్ ఫణిభూషన్‌రెడ్డి నిలదీశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. బైరాపురం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయంలో విద్యుత్ బిల్లులు చెల్లించుకోలేదని, తర్వాత రెండు సంవత్సరాలు ప్రత్యేక అధికారుల పాలనలో నిధులు పుష్కలంగా ఉన్నా మీరెందుకు బిల్లులు కట్టించుకోలేదన్నారు. మేము సర్పంచ్‌లుగా వచ్చిన తర్వాతనే బిల్లులు ఎందుకు అడుగుతున్నారని, అప్పుడే మీరు విద్యుత్ బిల్లులు కట్టించుకుని ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని ప్రశ్నించారు. గ్రామాల్లో విద్యుత్ కొరత ఉందని వీధి లైట్లు లేవని, మీ దగ్గర ఉంటే లైట్లు ఇవ్వాలని విద్యుత్‌శాఖ ఏడీ క్రాంతికుమార్‌ను కోరారు. గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులను చేయాలని పది సంవత్సరాలుగా చేసిన వాటినే చేస్తూ ఉన్నారని, పొలాలకు గ్రావెల్ రోడ్లు వేయమంటే ఎందుకు వేయడం లేదని సహకార సొసైటీ చైర్మన్ నాగతులసి రెడ్డి అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ ఘని బాబు, సీడీపీవో కోటేశ్వరమ్మ, సర్పంచులు మదార్ సాహెబ్, ఇందిరమ్మ, ఉషారాణి, మరియమ్మ, ఎంపీటీసీలు ఫరీదా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నారీ శక్తి వందన్

నంద్యాల (కల్చరల్), మార్చి 4: పశ్చిమబెంగాల్‌లో సందేశ్ ఖాళీలో మహిళలపై జరిగిన అత్యాచారాలను నిరసిస్తూ నారీశక్తి వందన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు పేర్కొన్నారు. సోమవారం 500 మంది విద్యార్థినులతో టౌన్ హాలు నుంచి శ్రీనివాససెంటర్, సంజీవనగర్ గేట్ వరకు 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సురవరం గీతామాధురి, డా. రామక్రిష్ణారెడ్డి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు వనిత శ్రీనివాసన్, రాష్ట్ర మహిళా మోర్చా నిర్మల కిషోర్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు శబరి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బత్తిని స్వాతి, మహిళా మోర్చా నాయకులు మధుర, శ్రీవాణి, సౌజన్య, శ్రీజ్యోతి పాల్గొన్నారు

జొన్న కొనుగోలుకు చర్యలు

గడివేముల, మార్చి 4: చిన్న, సన్నకారు రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయాధికారుల ఏకపక్ష ధోరణి, గోనె సంచుల కొరతపై నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత కలెక్టర్ శ్రీనివాసులు, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డిలకు మార్చి 2న ఫిర్యాదు చేయడంతో సోమవారం జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి పెసరాయి రైతులతో సమావేశమయ్యారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధిక మొత్తంలో జొన్న పంట సాగు చేశామని, పూర్తిస్థాయిలో జొన్న కొనుగోలు చేయాలని రైతులు జేసీని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జొన్న పంటను తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన మండలాల్లో మిగిలిన సంచులను గడివేముల మండలానికి బదిలీ చేసి చిన్న, సన్నకారు రైతుల వద్ద జొన్న పంటను కొనుగోలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాజశేఖర్, మార్క్‌ఫెడ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు



ఆత్మకూరు, మార్చి 4: శ్రీశైల మహాక్షేత్రానికి కాలినడకన వెళ్లే పాదయాత్రికుల వల్ల అడవికి, వన్యప్రాణులకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అటవీ సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే అటవీమార్గం మధ్యలో అక్కడక్కడ శిబిరాలను ఏర్పాటు చేసి అటవీ సిబ్బందితో పాదయాత్రికుల వద్ద తనిఖీలు చేపడుతున్నారు. పాదయాత్రికుల వద్ద నుంచి బీడీలు, సిగరేట్లు, గుట్కాలు, అగ్గిపెట్టేలు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్నారు. అంతేకాకుండా ప్లాస్టిక్ కవర్లలో ఏవైనా.. ఆహార పదార్థాలు తీసుకెళ్తుంటే ఆ కవర్లను కూడా సేకరించుకుని ఆహార పదార్థాలను కాగితాల్లో కట్టి పంపిస్తున్నారు. అటవీమార్గంలో పాదయాత్రికులు వన్యప్రాణుల సంచారానికి భయపడి నిప్పంటిస్తున్నారని, దీంతో అడవిఅగ్నికి ఆహుతవ్వడంతో పాటు వన్యప్రాణులకు కూడా ముప్పు వాటిల్లనుందన్న నేపథ్యంలో అటవీశాఖ ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటుంది. అంతేకాకుండా గుట్కా కవర్లు, ప్లాస్టిక్ కవర్లను వన్యప్రాణుల ఆహారం తీసుకునే క్రమంలో వాటిని తినే ప్రమాదం ఉంది. ఈ కారణంగా వన్యప్రాణులకు జీర్ణం కాక మృత్యువాతపడే అవకాశాలు లేకపోలేదు. దీనిని దృష్టిలో వుంచుకునే అటవీశాఖ ప్లాస్టిక్ తయారీ వస్తువులను నియంత్రిస్తున్నారు. ఇదిలావుంటే మార్గం వెంట హెచ్చరికలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేసి అటవీ సంరక్షణపై పాదయాత్రికులకు అవగాహన కల్పిస్తున్నారు.

తాగునీటి సమస్యను తీర్చండి


తాగునీటి సమస్యపై మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్న ఆర్డీటీ కాలనీవాసులు

ఆత్మకూరు, మార్చి 4: ఆత్మకూరు పట్టణ శివార్లలోని ఆర్డీటీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అయితే ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ అందుబాటులో లేకపోవడంతో ఆర్డీటీ కాలనీవాసులు కాసేపే అక్కడే నిరీక్షించారు. కాలనీలోని చేతి పంపు మరమ్మతులకు గురవ్వడంతో పాటు కాలనీకి వారం రోజులుగా నీటి సరఫరా జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అసలే ఆర్డీటీ కాలనీ పట్టణానికి దూరంగా ఉండటంతో నీటిని తీసుకెళ్లందుకు కూడా అవస్థలు పడాల్సి వస్తోందని తెలిపారు. ఈవిషయంపై మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్‌ను వివరణగా ఆర్డీటీ కాలనీలో తాగునీటి సమస్యను వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. మంగళవారం ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది ఆర్డీటీ కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కరించేలా చొరవ తీసుకుంటామని తెలిపారు.

శ్రీశైలం పాదయాత్రికులకు అల్పాహారం

పాములపాడు, మార్చి 4 : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శ్రీశైలం పాదయాత్ర వెళ్తున్న శివస్వాములకు, భక్తులకు ఉచితంగా అల్పాహారాన్ని శ్రీలక్ష్మి రైస్‌మిల్ అధినేత జనార్ధన్‌గుప్తా కుటుంబ సభ్యులు అందించారు. సోమవారం కేజీ రోడ్డు పక్కన రైస్‌మిల్‌లో భక్తులకు ఉగ్గాని, బజ్జీ, స్వీటును ఏర్పాటు చేశారు. గత మూడు సంవత్సరాలుగా శ్రీశైలం పాదయాత్రికులకు అల్పాహారం అందిస్తున్నారు.


పాములపాడులో శివస్వాములకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

వైసీపీని ప్రజలు నమ్మరు..

టీడీపీ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి



టీడీపీ బూత్ కమిటీలపై చర్చిస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

డోన్, మార్చి 4: నిత్యం అబద్ధాలతో పాలన సాగిస్తున్న వైసీపీని ఇక ప్రజలు నమ్మరని డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు, టీడీపీ యువనేత కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో టీడీపీ బూత్ కమిటీలపై కోట్ల రాఘవేంద్రరెడ్డి పార్టీ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ వైసీపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో నిరుద్యోగ యువతకు పెద్దపీట వేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని అన్నారు. సీఎం జగన్ మోసపూరిత హామీలతో యువతను వంచించారని ధ్వజమెత్తారు. డోన్ నియోజకవర్గ ప్రజలకు కోట్ల, కేఈ కుటుంబాలు ఎంతో అభివృద్ధి చేశాయన్నారు. కోట్ల కుటుంబం ఎప్పుడు ప్రజలకు సేవ చేయడానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, రాంబాబురెడ్డి, ఎర్రగుంట్లపల్లి రమేష్ రెడ్డి, దేవరబండ వెంకటనారాయణ, విజయకుమార్ రెడ్డి, భాష్యం శ్రీధర్, హరిశంకర్‌గౌడు, భూమా నాగన్న, రవి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడ కర్ణాటక మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

డోన్(రూరల్), మార్చి 4: పట్టణంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న వారిపై దాడులు నిర్వహించి సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సెబ్ సీఐ జయనాథరెడ్డి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బంగారయ్య వీధికి చెందిన జయశ్రీ అనే మహిళ అక్రమ మద్యం విక్రయిస్తుండగా.. తనిఖీలు నిర్వహించి ఆమె నుంచి 50 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసకున్నట్లు తెలిపారు. అలాగే కొండపేటకు చెందిన కన్నా అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా.. 119 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరికి పాండురంగ గౌడు అనే వ్యక్తి మద్యం తరలిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్ రావు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

బనగానపల్లె, మార్చి 4: బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఈనె 7నుంచి నిర్వహించే శివరాత్రి ఉత్సవాలపై సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమావేశానికి హాజరయ్యారు. ఛైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఉత్స వాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, క్యూలైన్లు, వాహనాల పార్కింగ్ తదితర విషయాలపై చర్చించారు. తహసీల్దారు రవీంద్రరెడ్డి, విద్యుత్ ఏఈ నాగ రాజు, డాక్టర్ శివశంకరుడు, ఫైర్‌స్టేషన్ అధికారి నరసింహులు, ఈవో ఆర్‌డీ శివరామయ్య, ఎస్‌ఐ రామిరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

డోన్(రూరల్), మార్చి 4: విద్యార్థినులు చదువుపై దృష్టి సారించి పాఠశాలకు మంచి పేరు తేవాలని డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ న్యాయ్యాధికారి తంగమణి ఆకాంక్షించారు. పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ న్యాయ్యాధికారి తంగమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగంను పూలమాలలతో శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డా.మాధవీలత, పాఠశాల గౌరవ ఉపాధ్యాయురాలు పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

బనగానపల్లె, మార్చి 4: మండలంలోని బీరవోలు గ్రామానికి చెందిన ఎరుకలి ఆవుల కళ్యాణి(25) కడుపునొప్పి తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు నందివర్గం ఎస్‌ఐ తిరుపాలు సోమవారం తెలిపారు. కళ్యాణిని తాడిపత్రికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేసినట్లు తల్లి నాగమ్మ తెలియజేసిందన్నారు. నిత్యం కడుపునొప్పి రావడంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని బనగానపల్లె వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

బేతంచెర్ల, మార్చి 4: బేతంచెర్ల పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఏఎస్‌ఐ లింగమయ్య సోమవారం రాత్రి తెలిపారు. ఇంటి నుంచి బయటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాకపోవడంతో సమీప బంధు వులను ఆమె ఆచూకీ కోసం వెతికినా తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశారని ఏఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హౌసింగ్ ఏఈపై దాడికి యత్నం

ఆళ్లగడ్డ, మార్చి 4: ఆళ్లగడ్డ హౌసింగ్ ఏఈ రమణారెడ్డిపై మండలంలోని గోపాలపురం వైసీపీ సర్పంచు రామలక్షమ్మ కుమారుడు శివకుమార్‌రెడ్డి సోమవారం పట్టణంలోని హౌసింగ్ కార్యాలయంలో దాడికి యత్నం చేశారు. గ్రామంలోని పేదలు ఇళ్లు కట్టుకున్నారని, వారికి ఎందుకు బిల్లులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ దాడి చేయడానికి సిద్ధపడ్డారు. అక్కడే ఉన్న కొందరు దీనిని అడ్డుకున్నారు.

మద్యంతాగి వాహనం నడిపినందుకు జైలు శిక్ష

ఆళ్లగడ్డ, మార్చి 4: మద్యం సేవించి వాహనం నడిపిన సుమిత్ర బాబు అనే వ్యక్తికి ఆళ్లగడ్డ కోర్టులో ఇన్‌చార్జీ కోవెలకుంట్ల జడ్జి ఒక నెల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించారని పట్టణ ఎస్‌ఐలు వెంకటరెడ్డి, నగినా సోమవారం చెప్పారు. ఈనెల 1వ తేదీన పట్టణ సీఐ రమేష్ బాబు ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ పాతబస్టాండులో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లుగా కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారణ చేసిన జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారని ఎస్‌ఐలు చెప్పారు.

పేరా రామసుబ్బారెడ్డి మృతికి బీసీ సంతాపం

కోవెలకుంట్ల, మార్చి 4: కోవెలకుంట్ల పట్టణానికి చెందిన టీడీపీ యువ నాయకుడు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి తండ్రి పేరా వెంకటసుబ్బారెడ్డి (76) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన పార్థివదేహానికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పూలమాలలు వేసి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే టీడీపీ నాయకులు కాత్రెడ్డి మల్లికార్జునరెడ్డి, అమడాల మద్దిలేటి, లాయర్లు అల్లిహుసన్, ఆంజనేయులు, రాజశేఖర్ వెంకటసుబ్బారెడ్డి పార్థివదేహానికి నివాళి అర్పించారు.

వైసీపీకి షాక్

» కొలిమిగుండ్ల, సంజామల మండలాల నుంచి పలువురు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 4: ఎన్నికల నోటిఫికేషన్ మొదలు కానప్పటికీ వైసీపీకి షాక్‌లు తగులుతున్నాయి. సోమవారం కొలిమిగుండ్ల, సంజా మల మండలాల నుంచి వైసీపీని వీడి పలు కుటుంబాలు బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కొలిమిగుండ్లకు చెందిన ఎస్సీ కాలనీకి చెందిన 32 కుటుం బాలు బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. తెలుగుయువత అధికార ప్రతినిధి మంద విజయ్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు కాయ చిన్న పుల్ల య్య, గుంతల ప్రతాప్, పాములేటి, రవికుమార్, గుంతల ఓబులేసు, చెంచుగాళ్ల ఆంజనేయులుతోపాటు 32 కుటుం బాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన దళిత నాయకులు మాట్లాడుతూ టీడీపీతోనే దళితులకు నిజమైన అభివృద్ధి జరుగుతుందన్నారు. బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీలో చేరిన కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

● సంజామల మండలం ఆకుమళ్ల గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ నూలి చిన్న వెంకటయ్య తన అనుచరులతోపాటు మహిళానేతలతో కలసి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో సోమవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. సర్పంచ్ చిన్నవెంకటయ్య మాట్లాడుతూ గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో సర్పంచ్‌లకు నిధుల్లేక కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ హయాంలో సర్పంచ్‌లకు నిధులు పుష్కలంగా ఉండడంతో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల వ్యవస్థతో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారారన్నారు. బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభు త్వంలో పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని బీసీ తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధి సిబ్బంది నిరసన



రుద్రవరం, కోవెలకుంట్ల, చాగలమర్రిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధి సిబ్బంది

కోవెలకుంట్ల, మార్చి 4: కోవెలకుంట్ల పట్టణంలోని ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా పీఆర్‌సీని వర్తింపచేయాలని, ఇతర డిమాండ్లను నెరవేర్చాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జయభారత్‌రెడ్డి, మధు, కిరణ్, రాధాదేవి, ప్రసాదరెడ్డి, కొండారెడ్డి, పక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: ఉపాధిహామీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం ఎంపీడీవో కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలతో ఉపాధి హామీ సిబ్బంది నిరసన తెలిపారు. వైఎస్ జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు పాదయాత్ర సమయంలో ఉపాధిహామీ సిబ్బంది ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అయితే ఇంతవరకు ఉపాధి హామీ సిబ్బందికి జీతాలు పెంచలేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో టీఏలు ఘనమద్దిలేటి, రవి, నరసింహారెడ్డి, ఓబులేసు, బాలనాయక్, వెంకటన్న, కంప్యూటర్ ఆపరేటర్లు ప్రసాదు, రమణారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని ఉపాధి హామీ పథకం కంప్యూటర్ ఆపరేటరు పెద్దయ్య అన్నారు. సోమవారం కొలిమిగుండ్లలో ఉపాధి హామీ పథకం సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పెద్దయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన సమయంలో ఉపాధిహామీ సిబ్బంది ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తానని హామీ ఇచ్చారని, కానీ దాన్ని అమలు చేయలేదని అన్నారు. రమేశ్, సుబ్బరాయుడు, దే వా, రమేశ్, బాలరాజు, మునిరాజ్, ఓబులేసు, బాషా పాల్గొన్నారు.

రుద్రవరం: పాదయాత్రలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని విస్మరించారని ఉపాధి సిబ్బంది, అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రుద్రవరం ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. 2019 సంవత్సరం నుంచి ప్రభుత్వ పరిపాలనలో ఉపాధి హామీ సిబ్బందికి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా జీతాలు పెంచలేదని ఆరోపించారు.

టీడీపీని గెలిపించండి



పార్టీలో చేరిన వారితో టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్ నాయుడు

ఆళ్లగడ్డ, మార్చి 4: వచ్చే ఎన్నికల్లో ఆళ్లగడ్డలో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నాయకుడు భార్గవ్‌రామ్ నాయుడు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ మండలంలోని మిట్టపల్లె గ్రామంలో 70 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో ఆయన సమక్షంలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనతో ప్రజలు విసుగుచెందారని, ఈ ప్రభుత్వాన్ని గద్దెదింపెందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీని వీడి టీడీపీలో గ్రామానికి చెందిని మీసాల శివుడు, ఓబులకొండ, కృష్ణయ్య, చిన్న శ్రీనివాసులు, బోయిన ఓబులేసు, దూదేకుల నాగరాజు, గద్దం కొండయ్య, మీసాల గోపాల్ అనుచర వర్గం 70 కుటుంబాలు చేరాయి. వీరందరికీ టీడీపీ కండువ కప్పి భార్గవ్‌రామ్‌నాయుడు పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం



భూమా జగత్ విఖ్యాతరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

చాగలమర్రి, మార్చి 4: వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని, టీడీపీ తోనే రాష్ట్ర భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం చాగలమర్రి భూమా నగర్‌లో వైసీపీకి చెందిన ముల్లా రఫి, అమీర్, సుభహాన్, రహిమ్, సలీమ్‌లతో పాటు మరో 25 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారిని పార్టీ కండువా కప్పి భూమా జగత్ ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని అన్నారు. అందువల్లనే ప్రతి ఒక్కరు టీడీపీ వైపు చూస్తున్నారని అన్నారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరిఫ్, మౌలాలి, అనిఫ్, మాబులాల్, ముల్లా శ్యాబుల్, కరిముల్లా, అజిమ్, అబ్దుల్లా, గఫార్, జెట్టి నాగరాజు, ఫరూక్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన భూమా కిశోర్ రెడ్డి

ఆళ్లగడ్డ, మార్చి 4: ఆళ్లగడ్డకు చెందిన బీజేపీ నాయకుడు భూమా కిశోర్ రెడ్డి సోమవారం సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. టీడీపీ-బీజేపీ పొత్తుతో బీజేపీ తరఫున ఆళ్లగడ్డ అసెంబ్లీకి పోటీ చేయాలని అనుకున్నారు. అది కూడా వికటించడంతో వైసీపీలో చేరారు. ఈయనతో పాటు మహేశ్వరరెడ్డి, వీరభద్రారెడ్డి, రాజారెడ్డి, గంధం భాస్కరరెడ్డి తదితరులు చేరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



కుందూ నదిని పరిశీలిస్తున్న ప్రజాసంఘం నాయకులు

కోవెలకుంట్ల, మార్చి 4: పట్టణ శివారులోని కుందూ పరివాహక ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీటిని వదలి సమస్యను పరిష్కరించాలని కుందూ పరిరక్షణ సమితి సభ్యులు, ప్రజా సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామిని వేణుగోపాల్‌రెడ్డి, కరీం బాషా, సుధాకర్, రిటైర్డు టీచరు రాజు, ఓబులేసులు సోమవారం కుం దూనదిని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి మొదటి వారంలోనే కుందూ ఎండిపోవడంతో నది వెంట ఉన్న వంద గ్రామాలకు తాగునీటి సమస్య ఏర్పడుతుందన్నారు. కుందూ నది నీరు ప్రవహిస్తే తాగు నీటితో పాటు పశువులకు కూడా తాగేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. అలాగే భూగర్భజలాలు పెరుగుతాయని అన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

శిరివెళ్ల, మార్చి 4: రాష్ట్రంలో రానున్న ఎన్నికల దృష్ట్యా మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులు మెరుగు పరచాలని నం ద్యాల ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని గోవిందపల్లె, శిరివెళ్ల, వీరారెడ్డిపల్లె, యర్రగుంట్ల గ్రామాల్లోని పలు పోలింగ్ కేంద్రాలు, వాటిలోని మౌలిక సదుపాయాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఓటర్లకు అవసరమైన చోట ర్యాంపులను ఏర్పాటు చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కులశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

శిరివెళ్ల, మార్చి 4: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం అధ్యక్షతన మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఫణి రాజకుమారి సోమవారం తెలిపారు. గ్రామాల్లోని ప్రజా సమస్యలతో పాటు తాగునీరు, రెవెన్యూ, వ్యవసాయం, హౌసింగ్, ఉపాధి హామీ పనులు తదితర అన్ని శాఖలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొనాలని కోరారు. అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

రుద్రవరం, మార్చి 4 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు తోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని టీడీపీ నాయకులు శివ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని టి.లింగందిన్నె గ్రామంలో బాబు సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలతో కూడిన బ్యానరును ఏర్పాటు చేసి మేనిఫెస్టో పత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు.

ఈ క్రాప్‌పై సోషల్ ఆడిట్

చాగలమర్రి, మార్చి 4: మండలంలోని 17 సచివాలయాల పరిధిలో వ్యవసాయ సిబ్బంది చేసిన ఈక్రాప్ నమోదుపై సోషల్‌ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. సోమవారం మూడవ ఆర్‌బీకే కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 3,675 మంది రైతులు ఈక్రాప్ నమోదు చేయించుకున్నారని, అన్నారు. 13,569 ఎకరాలకు ఈకేవైసీ పూర్తి చేశామని అన్నారు. సోషల్ ఆడిట్ ద్వార ఈక్రాప్ నమోదుపై విచారణ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, వీపీఏ సుబ్బరాయుడు ఉన్నారు.

177 మంది చిన్నారులకు పోలియో చుక్కలు

చాగలమర్రి మండలంలోని గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు సోమవారం ఇంటింటికీ వెళ్లి 177 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారని వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. మొదటి రోజు 96 శాతం పోలియో చుక్కలు వేశామని అన్నారు. పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోయిన వారి గృహాల వద్దకు వెళ్లి రెండో రోజు పోలియో చుక్కలు వేయించామని అన్నారు. హెచ్ఈ వెంకటమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేస్తాం: ఆర్డీవో

బేతంచెర్ల, మార్చి 4: బేతంచెర్ల-వెల్దుర్తి డబుల్ రోడ్డు నిర్మాణంలో పొలాలు పోయి నష్టపోయిన బాధిత రైతులందరికీ నష్టపరిహారం అందేలా న్యాయం చేస్తామని డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జీవన్ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్ ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని ఎం. పెండేకల్, ముద్దవరం గ్రామాల్లో 64 సెంట్ల మేర ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులతో గ్రామాల సర్పంచులతో సమావేశం నిర్వహించారు. బాధితులందరికీ న్యాయం చేస్తామని ఆర్డీవో తెలిపారు. సమావేశంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వరరెడ్డి

ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుంది



గోవిందపల్లెలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శిరివెళ్ల, మార్చి 4: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని గోవిందపల్లె గ్రామంలో సూపర్-6 పోస్టర్లను ఆవిష్కరించి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. వైసీపీ పాలనను భరించలేక ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలోకి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగదాసరి శ్రీనివాసరెడ్డి, గంగదాసరి రవిచంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, సంగిరెడ్డి నాగేశ్వరరెడ్డి, ఎస్ ప్రతాప్‌రెడ్డి, ఎస్‌సీ సుబ్బారెడ్డి, ఎస్‌వీ సుబ్బారెడ్డి, ఎల్‌సీ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

బేతంచెర్ల, మార్చి 4: కర్నూలు రహదారిలోని షిరిడీ సాయిబాబా కళ్యాణ మండపంలో పేదలకు ఇళ్ల పట్టాలను రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. బేతంచెర్లలో చలంరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 1250 మంది కుటుంబాలు హక్కు పత్రాలను కల్పించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల మున్సిపల్ ఛైర్మన్ చలంరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, ఆర్డీవో మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు పంపిణీ: బేతంచెర్ల పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన కురువ తిమ్మరాజు కుమారుడు రఘు అనారోగ్యంతో కర్నూలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు మంత్రి బుగ్గన దృష్టికి తమ ఆర్థిక ఇబ్బం దులను తీసుకురావడంతో ఆయన స్పందించి మృతుని తండ్రి తిమ్మరాజుకు రూ.లక్ష చెక్కును మంజూరు చేయించి అందజేశారు. కార్యక్రమంలో టైలర్ ఆనంద్, నాగరాజు పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ సహాయకుల నియామకం

రుద్రవరం, మార్చి 4 : మండలంలోని నాలుగు సచివాలయాలకు పశుసంవర్ధక సహాయకులను నియమించినట్లు ఎంపీడీవో రామచంద్ర సోమవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎంపిక య్యారన్నారు. ఆలమూరు సచివాలయానికి శ్రీవాణి, చిన్నకంబలూరు సచివాలయానికి ప్రవీణ్‌కుమార్, పెద్దకంబలూరు సచివాలయానికి కొండయ్య, రుద్రవరం-1 సచివాలయానికి ఎ.ఖలీల్‌బాషాను నియమించామని తెలిపారు.

తపాలా జీవిత బీమాపై అవగాహన

చాగలమర్రి, మార్చి 4: చాగలమర్రిలోని బాలుర, బాలికల, డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు తపాలా జీవిత బీమాపై సోమవారం సబ్ పోస్టుమాస్టర్లు ప్రభాకర్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పొదుపు చేయడంతో పాటు ఇన్సూరెన్స్ ట్యాక్స్ సేవింగ్స్ కూడా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ పథకానికి డిగ్రీ, డిప్లొమా కలిగిన వారు, కాంట్రాక్టు ఉద్యోగులు కూడా ఇన్సూరెన్స్ చేసుకోవచ్చని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పీఎల్‌ఐ సేవలు లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడిని కలిసిన నాగేశ్వరరావు యాదవ్



అచ్చెన్నాయుడితో కలసి జయహో బీసీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు యాదవ్

ప్యాపిలి, మార్చి 4: అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును టీడీపీ బీసీ సాధికార సమితి అధ్యక్షుడు వై నాగేశ్వరరావుయాదవ్ కలిశారు. ఈ సందర్భంగా మంగళవారం అమరావతిలో జరిగే రాష్ట్ర స్థాయి జయహో బీసీ కార్యక్రమంపై పార్టీ అధ్యక్షుడు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు నాగేశ్వర రావు యాదవ్ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగిస్తే సహించం

డోన్(రూరల్), మార్చి 4: విధులకు ఆటంకం కలిగిస్తే సహించేది లేదని డోన్ కేవీఎస్ హాస్పిటల్ అధినేత, చిన్నపిల్లల వైద్యనిపుణుడు శ్రీధర్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని కేవీఎస్ హాస్పిటల్ మీటింగ్ హాలులో పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రజా సంఘాల ముసుగులో కొందరు వ్యక్తులు కేవీఎస్ హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యులపై దురుసుగా మాట్లాడటం, ఫొటోలు, వీడియోలు తీసి విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఈ సమావేశంలో పలు ప్రైవేటు హాస్పిటల్స్ డాక్టర్లు సుంకన్న, రాజశేఖర్, భార్గవరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి: సీఐ

బేతంచెర్ల, మార్చి 4: గ్రామాల్లోని ప్రజలు ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని సీఐ ప్రియతమ్ రెడ్డి సూచించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బేతంచెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మకమైన గ్రామమైన రుద్రవరం గ్రామంలో బేతంచెర్ల పట్టణ సీఐ ప్రియతమ్ రెడ్డి, సిబ్బందితో పల్లెనిద్రను సోమవారం రాత్రి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమణ, రాజు నాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్యాపిలి, మార్చి 4: తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని కలచట్ల గ్రామస్తులు టీడీపీ నాయకుడు కలచట్ల ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. గత నెల రోజులుగా నీటి సమస్యతో బాధపడుతున్నా అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అధికారి హామీ ఇచ్చారు.

జీఆర్ సర్వే వంద శాతం పూర్తి చేయాలి

చాగలమర్రి, మార్చి 4: గ్రామాల్లో జీఆర్ సర్వే వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాయలంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఎంఈవోలు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని అన్నారు. ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

సిద్ధ రామేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలు

కొలిమిగుండ్ల, మార్చి 4: కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామంలో సిద్ధ రామేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నవగ్రహాలు, గణపతి, పార్వతి, గంగమ్మ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం వేద పండితులు ఆలూరు రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బెలుం, బెలుం శింగవరం గ్రామాలకు చెందిన బృందాలు భజనలు చేశాయి.